క్లుప్తంగా

సింహగిరిపై రాపత్తు ఉత్సవాలు



తిరువీధిలో స్వామి, దేవేరుల ఉత్సవమూర్తులు

సింహాచలం: సింహగిరిపై శుక్రవారం సాయంత్రం నుంచి రాపత్తు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పదిరోజులపాటు జరిగే ఈ ఉత్సవాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. స్వామికి వైకుంఠనాథుడి అలంకారం చేసి శ్రీదేవి, భూదేవి సమేతంగా సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. మహిళల కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. 19 వరకు జరిగే ఉత్సవాల్లో రోజుకో అలంకారంలో స్వామివారికి తిరువీధి నిర్వహిస్తారు.

ఘనంగా ధారోత్సవాలు

సింహాచలం: సింహగిరిపై శుక్రవారం ధారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలను పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి అర్చకులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో అధిష్ఠింపజేసి, తిరువీధిగా సింహగిరిపై ఉన్న గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అమ్మవారికి గంగధార జలాలతో అభిషేక సేవ నిర్వహించారు. అనంతరం అక్కడే ఉన్న పురాతన మండపంలో అమ్మవారిని కొలువుంచి, విశేష ఆరాధన, తిరుప్పావై సేవాకాలం నిర్వహించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.


'అలివిర పరిశ్రమపై చర్యలు తీసుకోండి'

పరవాడ: స్థానిక ఎస్‌ఈజెడ్‌లోని అలివిర యానిమల్ హెల్త్ లిమిటెడ్ పరిశ్రమలో బుధవారం జరిగిన ప్రమాదాన్ని గోప్యంగా ఉంచిన యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరిశ్రమలో వెల్డింగ్ పనులు చేస్తున్న హెల్పర్ జీహన్ అన్సారీపై డయా మిథైల్ సల్ఫైడ్ రసాయనం పడి, పొట్టపై బొబ్బలు ఏర్పడ్డాయన్నారు. గాయపడిన హెల్పర్‌ను అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, గోప్యంగా చికిత్స అందించినట్లు పేర్కొన్నారు.

- చదువుతోపాటే ఉన్నత లక్ష్యాల దిశగా యువత
- వివేకానందుడి సూక్తులే స్ఫూర్తిగా సాగుతున్న వైనం
- రేపు వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం

యువతా.. మేలుకో!

'లేవండి.. మేల్కోండి.. గమ్యం చేరే వరకు విశ్రమించకండి. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువత ఈ దేశానికి అవసరం' అంటూ యువశక్తిని జాగృతపరిచేలా స్ఫూరిదాయకమైన ఎన్నో సందేశాలను అందించారు స్వామి వివేకానంద. శతాబ్దాలు గడిచినా ఆయన బోధనలు యువతకు శిరోధార్యాలు. వాటిని వంటబట్టించుకుని ఎదిగినవారెందరో.. ఎదగాలనే కాంక్షకు పదునుపెడుతున్నవారు ఇంకెందరో..! ఆదివారం స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా..



పెందుర్తి:

స్వామి వివేకానంద.. ఈ పేరు చెబితే చాలు యువతకు ఎక్కడ లేని బలం వచ్చేస్తుంది. లక్ష్యాలను సాధించాలన్న సంకల్పం బలపడుతుంది. దాన్ని చేరుకోవాలన్న కసి మరింత పెరుగుతుంది. యువతకు ఆ మహనీయుడు అందించిన సూక్తులు నిత్యం ప్రేరణ కలిగిస్తున్నాయి. ఈ కాలంలోనూ అనేక మంది విద్యార్థులకు వివేకానందుని మార్గం అనుసరణీయం. ఆ మహనీయుడి స్ఫూర్తితో సమకాలీన అంశాలను ఎంచుకుని లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగిపోతున్నారు. పట్టువదలని విక్రమార్కుల్లా లక్ష్యాన్ని సాధించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. చిన్ననాటి నుంచి వివేకానందుని స్ఫూర్తితో తాము అనుకున్న లక్ష్యాలను సాధించిన పెద్దలు, ఆ బాటలో సాగుతున్న యువత మనోగతం..

నాట్య రంగంలో నాకో పేజీ ఉండాలి



చదువుతో పాటు సంప్రదాయ నృత్యంపై నాకు, నా తల్లిదండ్రులకు ఎంతో మక్కువ. ప్రస్తుతం శ్రీనిర్మల నృత్య నికేతన్‌లో మా గురువు విజయజ్యోతి వద్ద తర్ఫీదు పొందుతున్నా. నాలుగేళ్లలో కూచిపూడి నృత్యంలో దేశంలోని పలు ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల వద్ద ప్రత్యేక రోజుల్లో ప్రదర్శనలు ఇచ్చాను. జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు వచ్చింది. ప్రస్తుతం సీసీఆర్‌టీ స్కాలర్‌షిప్ కోసం ప్రాథమిక స్థాయిలో ఎంపికయ్యాను. త్వరలో ఫైనల్ ఇంటర్వ్యూ ఉంది. నాట్య రంగంలో నాకో పేజీ ఉండాలన్నదే ఆ కల. – డి.పూజ, జాతీయ స్థాయి కూచిపూడి నృత్య కళాకారిణి, పెందుర్తి

అంతర్జాతీయ గుర్తింపే లక్ష్యం



చిన్ననాటి నుంచి బాక్సింగ్ అంటే ఆసక్తి. తల్లిదండ్రులు బాగా ప్రోత్సహించారు. అలా అని ఎక్కడా చదువును నిర్లక్ష్యం చేయలేదు. బాగా డిప్రెషన్‌లో ఉన్నప్పుడు వివేకానందుని సూక్తులు చదువుతాను. ప్రేరణ కలిగిస్తాయి. జిల్లా స్థాయిలో రాణించడంతో రాష్ట్రస్థాయిలో ఇటీవలే ప్రాతినిధ్యం వహించి బంగారు పతకం సాధించా. పంజాబ్‌లో జరగనున్న జాతీయ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యా. దేశానికి ప్రాతినిధ్యం వహించి అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చుకోవాలన్నదే నా తపన.

– టి.అభయ్‌కుమార్, కిక్ బాక్సింగ్ జాతీయ క్రీడాకారుడు, విస్తం కళాశాల, పెందుర్తి

వివేకానంద సూక్తులే ప్రేరణ



జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నామన్న భావనతో తప్పుదోవలో నడిచే యువతకు వివేకానందుడి జీవితం, ఆయన చెప్పిన మాటలు చిరస్మరణీయాలు. విద్యార్థి దశ నుంచే వివేకానందుడి జీవిత చరిత్రను చదివితే ఆయన విలువతో పాటు, మన విలువ కూడా మనకు తెలుస్తుంది. ముందుగా వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవాలి. మంచి అలవాట్లు, క్రమశిక్షణతో ముందుకు సాగితే లక్ష్యాలు అవే మన చెంతకు చేరుతాయి. విద్యార్థి దశలో వివేకానందుని సూక్తులు నన్ను చాలావరకు ముందుకు నడిపించాయి.

– కె.వి.సతీష్‌కుమార్, సీఐ, పెందుర్తి

వెయ్యేనుగుల బలం



స్వామి వివేకానందుడు భారతదేశ సంస్కృతిని ప్రపంచ దేశాలకు విస్తరించడంలో చక్కని వారధిగా నిలిచారు. టెక్నాలజీ పరంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలోనూ స్వామి వివేకానంద జీవితం నిత్య స్ఫూర్తి. నిరాశ, నిస్పృహలో ఉన్నప్పుడు ఆయన సూక్తులు గుర్తు చేసుకుంటే వెయ్యి ఏనుగుల బలం వస్తుంది. ఆయన జయంతి సందర్భంగా 2014లో జాతీయ యువజన అవార్డు అందుకోవడం మరచిపోలేని మధురానుభూతి. యువత ఆయన మార్గంలో నడవాలి.

– బి.హరి, కార్టూనిస్ట్

సివిల్స్‌కు ప్రిపేర్ అవుతా..



నాకు ఊహ తెలిసిన నుంచి వివేకానందుని సూక్తులు ఆసక్తిగా చదివేవాడిని. తెలియకుండానే ఆయన ప్రభావం నాపై కొంతవరకు పడింది. అదే సివిల్ సర్వీస్‌పై ఆసక్తి కలిగేందుకు కారణమయింది. మా తండ్రి కల కూడా అదే. సివిల్స్‌కు తగ్గ సాధన ఇప్పటికే ప్రారంభించాను. డిప్లొమా పూర్తి కాగానే సివిల్స్ దిశగా మరింత సాధన చేస్తాను. ఒక నిజాయితీ గల కలెక్టర్‌గా ప్రజా సేవ చేయాలన్నదే నా ఆశయం.

– ఎస్‌వీఎస్ తరుణ్‌కుమార్, డిప్లొమా థర్డియర్, పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

గర్వపడుతున్నా..



నా విద్యార్థి జీవితంలో సహచర విద్యార్థుల ద్వారా వివేకానందుని సూక్తులు తొలిసారి విన్నా. తర్వాత పుస్తకాలు చదివి తెలుసుకున్నా. వివేకానందుడు పుట్టిన గడ్డపై పుట్టినందుకు గర్వపడుతున్నా. ఆయన జీవితం, ప్రతి మాటా యువతకు స్ఫూర్తి. ఆయన బాటలో, ఆలోచనలతో సాగితే భయం బెరుకు అనేదే ఉండదు. నా గమ్యం నిర్ణయించుకుని, ఆ దిశగా సాగేందుకు ఆయన మాటలే నాకు స్ఫూర్తినిచ్చాయి.

– టి.అసిరితాత, ఎస్ఐ, సబ్బవరం

వీడిన బాలిక కిడ్నాప్ కేసు

- 80 రోజుల తర్వాత ఇంటికి చేరిన బాలిక
- పోలీసుల అదుపులో నిందితుడు



సీఐ పిన్నింటి రమణతో కలిసి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

సబ్బవరం: మైనర్ బాలిక కిడ్నాప్ కేసులో ఓ యువకుడిని సబ్బవరం పోలీసులు శుక్రవారం ఆరెస్ట్ చేశారు. సుమారు 80 రోజుల పాటు ముప్పుతిప్పలు పెట్టి, ఎట్టకేలకు నిందితుడు పోలీసులకు చిక్కాడు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో పాటు హోం మంత్రి దృష్టికి బాలిక కిడ్నాప్ వ్యవహారాన్ని ఆమె తండ్రి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, స్థానిక సీఐ పిన్నింటి రమణతో కలిసి శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు.

మండలంలోని గంగవరానికి చెందిన మైనర్ బాలిక కనిపించట్లేదని తండ్రి సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో గత ఏడాది అక్టోబర్ 20న ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన సీఐ రమణ దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలను పరిశీలించగా పతివాడ మహేష్(26) అనే యువకుడు బాలికను ద్విచక్రవాహనంపై తీసుకు వెళ్లినట్లు గుర్తించారు. దీనితో బాలిక అదృశ్యం కేసును నవంబర్ 11న కిడ్నాప్ కేసుగా నమోదు చేశారు. శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో బాలిక మండలంలోని అసకపల్లి జంక్షన్ వద్ద ఉన్నట్లు సమాచారం అందుకున్న తండ్రి అక్కడికి చేరుకున్నాడు. బాధిత బాలికను తీసుకుని సబ్బవరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, కిడ్నాప్‌కు పాల్పడిన మహేష్‌ను, అందుకు సహకరించిన బాధితురాలి పిన్ని కొడుకు మాటూరి సాయి(25)పై ఫిర్యాదు చేశారు. నిందితుడు మహేష్ స్వగ్రామం విజయనగరం జిల్లా సాలిపేట. జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తుంటాడు. బాలికను కిడ్నాప్ చేసి విజయవాడ తీసుకెళ్లి, వివాహం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మైనర్ బాలిక కిడ్నాప్ కేసుతో పాటు పోక్సో చట్టం, ఇతర సెక్షన్లపై కేసు నమోదు చేశామన్నారు. వివాహం చేసుకుని మైనర్ బాలికతో సంసారం కూడా చేయడంతో బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. బాధితురాలి తండ్రి తన కుమార్తె కిడ్నాప్‌తో పాటు బంగారు నగలు, నగదు పట్టుకెళ్లినట్లు గతంలో ఫిర్యాదు చేసినప్పటికీ, వాటి విషయం తనకు తెలియదని నిందితుడు చెప్పాడు. దీంతో నిందితుడికి సహకరించిన బాధితురాలి బంధువు సాయి నగలు అపహరించి ఉంటాడనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక

పరవాడ: జిల్లా ఆర్చరీ సంఘం ఆధ్వర్యంలో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి విలువిద్య పోటీలు శుక్రవారం ముగిశాయి. రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాలలో మెరుగైన ప్రతిభను కనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు విశాఖ జిల్లా ఆర్చరీ సంఘం ప్రధాన కార్యదర్శి కె.నిశాంత్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన దేశాయ్, లలితసాయి, యశ్వంత్ నాయుడు, తుజేశ్వర్, పూర్వ్‌రాథోడ్, నాభ్యప్రభాత్, గణేష్ మణిరత్నం, హర్షవర్ధన్, సాయిమనస్వి, వైష్ణవి, ఆధ్యలను సంఘ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కోశాధికారి భాస్కర్ అభినందించారు. కోచ్‌లు కె.గోవింద్, శివకుమార్‌ల ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు జరిగాయి.

దోమల నియంత్రణకు ఫాగింగ్

పరవాడ: పరవాడ గ్రామంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు చెప్పారు. ఫాగింగ్ యంత్రంతో శుక్రవారం దోమల మందును పిచికారీ చేశారు. గ్రామంలో విపరీతంగా పెరిగిన దోమల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నివారణ చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



పెదతాడిలో కోలాటం ప్రదర్శిస్తున్న కళాకారులు



కళాకారులకు చీరలు అందజేస్తున్న ఫార్మాసిటీ ఎం.డి.లాల్‌కృష్ణ



చిన్నారులతో సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, ఉపాధ్యాయ బృందం

పరవాడ: రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెదతాడి గ్రామంలో సంక్రాంతి సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశాఖ ఫార్మాసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.పి.లాల్‌కృష్ణ మాట్లాడుతూ భారతీయ కళలు మరుగున పడుతున్న ఈ రోజుల్లో తాడి గ్రామస్తులు ప్రాచీన కళలైన భజన, కోలాటం నృత్యాలను సాధన చేసి ప్రదర్శించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా కోలాట కళాకారులకు చీరలు, చిడతలు, భజన బృందానికి సౌండ్ బాక్స్, యమహా మ్యూజిక్ సిస్టం, డోలక్, భజన తాళాలను అందించారు. కార్యక్రమంలో ఫార్మాసిటీ సీఈవో ఎం.వాసుదేవరెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ గిరిధర్‌బక్షి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పి.రాఘవరెడ్డి, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ కె.శ్రీకాంత్, ఫార్మాసిటీ అధికారులు పాల్గొన్నారు.

- పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు హరిదాసు, గంగిరెద్దుల వారి వేషంలో అలరించారు. మరికొందరు చిన్నారులు పశువులు, కోడిపుంజులు, పాలు పొంగే బొమ్మలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలను మరచిపోకూడదన్నారు. ఉపాధ్యాయులు పూజిత, వినీల, లీలను పాఠశాల డైరెక్టర్ పి.ఉదయనాగశ్రీ అభినందించారు.
- విశాఖ ఫార్మాసిటీ హబ్‌లో సంక్రాంతి సంబరాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఉద్యోగులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఉద్యోగులు, సంక్రాంతి వేడుకలకు అధ్యక్షత వహించిన ఫార్మాసిటీ ఎండీ డాక్టర్ లాల్‌కృష్ణ మాట్లాడుతూ మన సంస్కృతిని భావి తరాలకు తెలియజేయాలని సూచించారు. అధికారులు వాసుదేవరెడ్డి, ఎర్రయ్య, రాఘవరెడ్డి, గిరిధర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమాజ సేవతోనే గుర్తింపు



వాహనాన్ని ప్రారంభిస్తున్న రమణచిట్టి

పెందుర్తి: మంచి మనసుతో సమాజసేవ చేస్తే గౌరవంతో పాటు తగిన గుర్తింపు దక్కుతుందని ప్రముఖ వ్యాపారవేత్త, సీనియర్ నాయకుడు దాడి రమణచిట్టి అన్నారు. పెందుర్తి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిరుపేదలు, అనాథల మృతదేహాలను తరలించేందుకు అంతిమ యాత్ర వాహనాన్ని సమకూర్చారు. శుక్రవారం పెందుర్తిలో జరిగిన కార్యక్రమంలో దాడి రమణచిట్టి దీన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్‌కు తగిన సహకారాన్ని ఎల్లప్పుడూ అందిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీనివాస్, దాత తిమ్మ నారాయణ తేజ, ట్రస్ట్ ప్రతినిధులు కందుల నవీన్, దాడి సురేష్, పెంటకోట గణేష్, పెతకంశెట్టి ఉమాశంకర్, రాజారావు, అప్పాజీరావు, శివకృష్ణ, చిరంజీవి, శ్రీను, కృష్ణ, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాల సీజ్

- రెండు కంటైనర్లలో 39 ఆవులు, గేదెలు



పోలీసులు పట్టుకున్న పశువులను తరలిస్తున్న కంటైనర్లు

పెందుర్తి: అక్రమంగా పశువులను తరలిస్తున్న రెండు కంటైనర్లను పెందుర్తి పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా మానాపురం సంతలో కొనుగోలు చేసిన 39 ఆవులు, గేదెల్ని రెండు కంటైనర్లలో ఎక్కించి ఒకటి హిందూపురం, మరొకటి నందిగామ తీసుకెళుతున్నారు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు శుక్రవారం వేకువజామున మండలంలోని పినగాడి కూడలి వద్ద మాటు వేసి వాహనాలను అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు. అనంతరం పశువులను సంరక్షణ నిమిత్తం భోగాపురంలోని గోశాలకు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

సర్వపాప హరణం.. ఉత్తర ద్వార దర్శనం



వేంకటాద్రిపై ఉత్తరద్వారంలో స్వామి, దేవేరులు



సాధూమఠం వద్ద ఉత్తరద్వారంలో పూజలందుకున్న రమా సత్యనారాయణస్వామి



సింహాచలం కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శేషతల్పంపై కొలువైన వెంకన్న



98వ వార్డు పరిధి సింహపురికాలనీలో ఉత్తర ద్వారంలో కొలువుదీరిన సీతారాములు

- వైభవంగా ముక్కోటి ఏకాదశి పూజలు
- వేంకటాద్రికి పోటెత్తిన భక్తజనం
- అడవివరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు
- ఆకట్టుకున్న నృత్యప్రదర్శనలు
- సింహాచలం కొండదిగువ వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- 98వ వార్డులో వాడవాడలా ఉత్తర ద్వార దర్శనం

పెందుర్తి: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి ఉత్తర ద్వార దర్శనంతో భక్తజనం పులకించిపోయింది. గోవింద నామస్మరణతో సర్వం మార్మోగింది. పవిత్ర వైకుంఠ(ముక్కోటి) ఏకాదశి సందర్భంగా స్థానిక వేంకటాద్రిపై శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. వేకువజామున వేంకటేశ్వరస్వామికి సుప్రభాత సేవ జరిపి, తిరుప్పావై ప్రవచనాలు వినిపించారు. అనంతరం విశేష అభిషేకాలు నిర్వహించారు. ఉత్తర ద్వారం ద్వారా వెంకన్న భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామిని దర్శించుకునేందుకు రికార్డుస్థాయిలో దాదాపు 55 వేలకు పైగా భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యులు అర్చనలు జరిపారు. ఈవో నీలిమ ఆధ్వర్యంలో శ్రీవారి సేవకులు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం గిరిప్రదక్షిణలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విస్తృత ఏర్పాట్లు

వెంకన్న ఉత్తర ద్వార దర్శనానికి వేలాదిగా భక్తులు తరలివస్తారన్న అంచనాతో ఈవో నీలిమ, ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజాచార్యుల ఆధ్వర్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. వేకువజాము నుంచే నాలుగు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి కొండ దిగువ నుంచి కొండపైకి భక్తులను ఉచితంగా తరలించారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో 65 మంది పోలీసులతో ఎన్నడూ లేనంత పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, ట్రాఫిక్‌ను నియంత్రించారు. 55 వేల మందికి పైగా భక్తులు ఉత్తరద్వార దర్శనం చేసుకోగా.. 3 వేల మందికి పైగా గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. మెడికవర్ ఆస్పత్రి సిబ్బంది ఉచిత వైద్య సేవలు అందించారు. వందలాదిగా వెంకన్న సేవకులు, విద్యార్థులు భక్తులకు సేవలు అందించారుర. శుక్రవారం ఒక్కరోజే శ్రీవారి హుండీ ఆదాయం రూ.1,08,571 వచ్చినట్లు ఈవో తెలిపారు.



వేంకటాద్రిపై వెంకన్న ఉత్తర ద్వార దర్శనానికి బారులు తీరిన భక్తులు

సంతోషిమాత ఆలయంలో..

సాధూమఠం సమీపంలోని సంతోషిమాత ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన రమా సహిత సత్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బి.మురళీకృష్ణశర్మ, బి.రాజ ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి, భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.



సింహగిరిపై నృత్యప్రదర్శన చేస్తున్న చిన్నారులు

దుర్గమ్మకు విశేష పూజలు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఎస్‌ఆర్ పురంలోని దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు.

ముక్కోటి వేళ భక్తులకు సేవలు

సింహాచలం: సింహగిరిపై శుక్రవారం ఎటు చూసినా ముక్కోటి ఏకాదశి సందడి నెలకొంది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్తరద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు.

- దర్శనానంతరం సింహగిరిపై ఉన్న అన్నప్రసాద భవనంలో భక్తులకు పొంగలి, పులుసు అన్నప్రసాదంగా అందజేశారు.
- అడవివరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో సింహగిరిపై మూడు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. డిప్యూటీ సివిల్ సర్జన్లు డాక్టర్ రామారెడ్డి, డాక్టర్ ప్రసాద్‌నాయక్‌లు వైద్య శిబిరాలను పర్యవేక్షించారు.
- సింహగిరిపై ఏర్పాటు చేసిన కూచిపూడి, భరత నాట్య నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



సీతారాముల దేవాలయంలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

- ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని సింహాచలం కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి ఉత్తరద్వార దర్శనం కనులపండువగా జరిగింది. తెల్లవారుజామున మూడు గంటలకు స్వామికి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులు వెంకన్న, శ్రీదేవి, భూదేవిలను విశేషంగా అలంకరించి ఆలయ ఉత్తరద్వారం వద్ద శేషతల్పంపై అధిష్ఠింపజేశారు. అధికసంఖ్యలో భక్తులు, అడవివరం గ్రామస్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్, భార్గవ్, విజయ్‌మారుతి పూజలను నిర్వహించారు. భక్తులందరికీ పొంగలి ప్రసాదాన్ని అందజేశారు.
- 98వ వార్డు పరిధి సింహపురికాలనీ రామాలయంలో స్వామివారి ఉత్తర ద్వార దర్శనం విశేషంగా జరిగింది. సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఆలయ ఉత్తర ద్వారం వద్ద వేంజేపచేశారు.
- అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సీతారాముల ఉత్తరద్వార దర్శనం వేడుకలను ఘనంగా నిర్వహించారు.

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరవాడ సీతారాముల దేవాలయంలో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. అనంతరం ఉత్తరద్వార దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు వి.సూరిబాబు. ఎన్.బ్రహ్మజీ, పైల పోతినాయుడు, లాలం రామారావు, పైల సూరిబాబు, రెడ్డి శ్రీను, జె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.